## క్లుప్తంగా

### కాంగ్రెస్ విజయం ఖాయం



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: మండలంలోని అంజనాపురం, తెలగవరం, గొల్లగూడెం గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న పథకాలను వివరించారు. అనంతరం పలు శుభకార్యక్రమాలకు హాజరైయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరావు, రామారావు, వీరారెడ్డి, ప్రభాకర్‌రావు, విద్యాసాగర్‌రావు, రవి, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మధిర: మధిర ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు కోరారు. శుక్రవారం మధిర మెడికల్ ఆఫీసర్‌కు కార్మికులతో కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐటీయూసీ చేసిన పోరాటం ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే పేషెంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందాయని.. కానీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎనిమిదినెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ నెల 18 లోగా జీతాలు ఇవ్వకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పద్దెనిమిది నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు యంగల ఆనందరావు, వర్కర్లు రాజు, కుమార్, మదన్, శాంతి, ప్రియాంక పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

బోనకల్: వేసవిలో బీపీ, షుగర్ బాధితులు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మేఘాశ్రీ హస్పటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు తెలిపారు.మండలంలోని కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, సాయికుమార్, ట్రస్ట్ సభ్యులు ఆకెన పవన్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

### పూసపల్లి కేసును ఎత్తివేయాలి

బోనకల్: పూసపల్లి కుట్రకేసును ఎత్తివేయాలని న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎం.గిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకత్వంలోని 24 మందిపై దేశద్రోహం కేసు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెద్దప్రోలు వెంకటేశ్వర్లు, పులుసు రవి, గోవిందరావు, గోపి, సన్నీ, నాగేంద్రమ్మ, కృష్ణవేని తదితరులు పాల్గొన్నారు.

### కొమ్మినేనికి మంత్రి నివాళి

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కొమ్మినేని లక్ష్మీనారాయణ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలిసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చంద్రుపట్ల చేరుకొని లక్ష్మీనారాయణ భౌతికాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొమ్మినేని భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని కృష్ణ, దిరిశాల నరసింహారావు, బైర్ల కాంతారావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరు జెడ్పీటీసీ సభ్యులు కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెట్టకంటి రామకృష్ణ, జక్కంపూడి కిషోర్, వల్లభనేని రవి, గొల్లమండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధురాలు మృతి

మధిరరూరల్: మధిర మండల పరిధిలోని సైదల్లీపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు చల్లా అన్నపూర్ణమ్మ(88) మృతి చెందారు. ఆమె రెండు రోజులు క్రితం అస్వస్థతకు గురి కాగా హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె తనయుడు చల్లా సాంబిరెడ్డి సిద్దినేనిగూడెం సొసైటీ డైరెక్టర్ కాగా వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు వారి కుటుంబానికి సంతాపం తెలిపారు.

# నిరీక్షించాల్సిందేనా..?

- 6 వారాలుగా అందని ఉపాధి నగదు
- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఆవేదనలో కూలీలు



ఏన్కూరులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ఏన్కూరు: రెక్కాడితే గాని డొక్కాడని కూలీలకు వేతనాలు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ప్రతి రోజు కూలీ పనులు చేసుకొని వచ్చిన కూలీ డబ్బులతో కడుపు నింపుకునే కష్టజీవులకు 6 వారాలుగా వేతనాలు రాకపోవడంతో అల్లాడిపోతున్నారు. మండుటెండలను లెక్క చేయకుండా పని చేస్తున్న ఉపాధికూలీలకు వారం రోజుల్లోనే వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఆరు వారాలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

**మండలంలోని వివరాలిలా..**

మండలంలో 25 పంచాయితీల్లో 46 హ్యాబిటేషన్లలో ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. మొత్తం మండలంలో 4,900 జాబ్‌కార్డులు ఉండగా ఉపాధిహామీ పనులకు 3,793 మంది కూలీలు హాజరవుతున్నారు. కనీస వేతనం రూ.300 గాను కూలీలకు రూ.220 చెల్లిస్తున్నారు. 46 హ్యాబిటేషన్లలో పంటకాలువ, చెక్‌డ్యాం, సాగర్ పిల్లకాల్వలు, చెరువు పూడికతీత పనులు, గుట్ట కందకాలు, నర్సరికి నీరు పెట్టడం తదితర పనులు జరుగుతున్నాయి.

**నిలిచిన చెల్లింపులు..**

కూలీలు పనులు చేసిన తరువాత వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు జరగాలి. కానీ ఇప్పటికి 6 వారాలు అవుతున్నా.. చెల్లింపులు జరగడంలేదు. దీంతో కూలీలు తమ పొట్ట నిండేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఫిబ్రవరి 15 వరకు చెల్లింపులు జరిగాయి. అప్పటి నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి.

**పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరవు..**

మండుతున్న ఎండల్లో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలి. కానీ అలాంటిదేమి లేకపోవడంతో ఎండలో పని చేస్తున్న కూలీలు సొమ్మసిల్లిపోతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేని పరిస్థితిక. పని ప్రదేశాల్లో గడ్డపార, పారలు కూడా ఏర్పాటు చేయడం లేదు.

**రూ.27లు చార్జీలు ఇస్తున్నారు..**

ఉపాధికూలీలు గ్రామం నుంచి పని ప్రదేశాలకు సుమారు 5 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుంది. దీనికి గాను అధికారులు రూ.27 చార్జీలు చెల్లిస్తున్నారు. కానీ ట్రాక్టర్లు, ఆటోలు, వ్యాన్ డ్రైవర్లు కూలీల వద్ద నుంచి రూ.30 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం జరుగుతుందని కూలీలు ఆరోపిస్తున్నారు.

**డబ్బులు రాక ఆరువారాలైంది..**



ఉపాధిహామీ పనులకు నేను నా భార్య కలిసి వెలుతున్నాం. ఆరు వారాలుగా చెల్లింపులు జరపడం లేదు. దీంతో కిరణా సరుకులు అప్పులు తీసుకొచ్చి పొట్ట నింపుకుంటున్నాం. చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వారం రోజుల్లోగా చెల్లింపులు చేయాలి.

– సీహెచ్ రాందాస్, ఉపాధికూలీ, తూతకలింగన్నపేట

**పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేవు..**



మండుటెండల్లో పని చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం, తాగునీటి సౌకర్యాలు లేవు. గడ్డపార, పార ఇవ్వడం లేదు. చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారు.

– ఇల్లూరి నాగమణి, ఉపాధికూలీ, తూతకలింగన్నపేట

# ఎంపీగా నామను గెలిపించండి



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పక్కన నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మధు, నాయకులు

పెనుబల్లి/కల్లూరు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామ నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు అన్నారు. శుక్రవారం పనుబల్లి మండల పరిధిలోని వీయం బంజర్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో, కల్లూరులోని బీఆర్ఎస్ నాయకుడు బొప్పన రామారావు గృహంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ.. నిత్యం ప్రజల కోసం పనిచేసే నాయకులకు ప్రజలు ఓటు వేయాలని, ప్రజా సమస్యలపై తాను పార్లమెంట్‌లో తెలంగాణా ప్రజల వాణిని వినిపించిన తనకు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. అనంతరం ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. గ్రామాల్లో కర్త, కర్మ, క్రియ మొత్తం పార్టీ కార్యకర్తలదేనన్నారు. నియోజకవర్గంలో నూతన బస్టాండ్, మినీ స్టేడియం, ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణం, ఇరిగేషన్ కార్యాలయం తదితర అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లోనై ఓటు వేసినందుకు ప్రజలు ఇప్పటికే బాధపడుతున్నారన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలకు, ప్రలోభాలకు లోను కాకుండా బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ఓటర్ల వద్దకు తీసుకెళ్లి ఓట్లు అభ్యర్ధించాలన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సండ్ర ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు, నాయకులు బొప్పన రామారావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, మేకల కృష్ణ, ఎండీ ఇస్మాయిల్, సర్రాబు వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, గంగవరపు శ్రీను, శీలం సత్యనారాయణరెడ్డి, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్ కిరణ్, రాచమళ్ళ నాగేశ్వరరావు, ఎంపీపీ అలేఖ్య, జెడ్పీటీసీ మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రావు, వెంకటేశ్వరరావు, చలపతిరావు, శ్రీనివాసరావు, జీవన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నేడు సన్నాహక సమావేశం..**

వేంసూరు: మండలపరిధిలోని మర్లపాడులో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపుకు శనివారం వేంసూరు మండల ముఖ్య నాయకులతో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి నామా నాగేశ్వరరావు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు హాజరు కానునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, పాలా వెంకటరెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, గొర్ల రాంమోహన్‌రెడ్డి, పుచ్చాకాయల శంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన కోటమైసమ్మ బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమై భక్తుల కోర్కెలు తీర్చే శ్రీకోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు మూడోరోజు శుక్రవారం ఘనంగా ముగిసాయి. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుతీరిన కోటమైసమ్మతల్లి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ, పర్సాట్రస్టుల ఆధ్వర్యంలో కృష్ణయజుర్వేద పండితులు కొడమంచిలి ఫణి కుమార్‌శర్మ బృందంతో నిర్వహించబడుతున్న బ్రహ్మోత్సవాలు చివరిరోజు మహాపూర్ణాహుతి, పవిత్రారోపణము, లవబృధ కలశ మార్జనములు, ఆశీర్వచనములు నిర్వహించారు. అనంతరం సింగరేణి మర్చంట్స్ అసోసియేషన్ ఇల్లందు వారిచే మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు వందలాధిగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు-విజయలక్ష్మి దంపతులు, పర్సా సనత్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాసశర్మ, సింగరేణి మర్చంట్ అసోసియేషన్ జుగల్ కిషోర్ ఖండేల్‌వాల్, ఉపాధ్యక్షులు మురళీధర్ భూతడా, కార్యదర్శి ఆర్ జగన్నాధం, తాటిపల్లి సుబ్బారావు, రితేష్ గోయల్, శ్యాం గోయల్, చందా వీరభద్రం, వినోద్ లాహోటి, గోపాల్ భట్టడ్, సునీల్ తోత్లా, చందా చక్రధర్, నారాయణదాస్ లాహోటి, గంది సురేష్, అంకిత్ గోయల్, అయిత శ్రీను, శ్రీరంగం సుబ్బారావు, ముఖేష్ సాహు, అనీల్ భూతడ, పసుమర్తి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది మూడ్ మోహన్ చౌహాన్, పర్సా సాయి, గణితి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిక



కండువాలు కప్పుతున్న ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌రావు

వైరా: వైరా మున్సిపాలిటీలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి సుమారు 50 కుటుంబాలు శుక్రవారం బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వినోద్‌రావు వారందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వైరా నియోజకవర్గ కన్వీనర్ కోటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, శ్యాంరాథోడ్, రవి, రామారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

కారేపల్లి: అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కారేపల్లికి చెందిన ఆదెర్ల రాములును నియమించారు. దీనికి సంబంధించి శుక్రవారం కారేపల్లిలో జరిగిన సదస్సులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఐలయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు అవకాశం ఇచ్చిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఐలయ్యకు ఇతర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### అన్నదానం

మధిర: మధిర సేవా సమితి బాధ్యులు ముప్వా రామకృష్ణ, లక్ష్మి కుమారుడు ముఖేష్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఆర్కే ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు, వికలాంగులకు, మతిస్థిమితం కోల్పోయిన వారికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దాచేపల్లి ముత్యాలు, మధిర సేవా సమితి అధ్యక్షుడు ప్రసాదరావు, కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకుడు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంగవీటి రాజా, కాజా శ్రీని వాసరావు, యర్రా లక్ష్మణ్, ఖాదర్ పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి విగ్రహప్రతిష్ఠ పూజలు



జలబిందెలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ శ్రీకృష్ణ మందిరాన్ని రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయంగా పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం యజ్ఞ పూజలు నిర్వహించారు. అదే విధంగా దేవతామూర్తుల విగ్రహాలకు వేదపండితుల సమక్షంలో వందలాది మంది మహిళలు జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి సుదర్శనం రామదుర్గా కుమారాచార్యులు ఆధ్వర్యాన రుత్వికులతో కలిసి గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్నిమదనం నిర్వహించి యజ్ఞ పాయసాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

**కంతమహేశ్వరస్వామి ఆలయంలో..**

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో శుక్రవారం గౌడసంఘం ఆధ్వర్యంలో కంతమహేశ్వరస్వామి సురమాంబ దేవాలయంలో సామూహిక ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం నూతనంగా నిర్మాణం చేపట్టి 16రోజులు ఐన సందర్భంగా గ్రామంలో కంతమహేశ్వరస్వామి, సురమాంబదేవి, వనం ఎల్లమ్మ, వనంమైసమ్మ దేవతలకు పూజలు చేశారు. కుటుంభ సభ్యులతో దంపతులు సామూహిక కుంకుమపూజలు, వివిధ అభిషేక కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పూర్ణాహుతి



రఘునాథగూడెంలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని రఘునాథగూడెంలో శ్రీకోదండరామస్వామి, బొడ్రాయి(నాభిశిల), దేవత విగ్రహ దినోత్సవ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం పూర్ణాహుతి హోమం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన కోదండ రామస్వామి దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రాలోని ఎన్టీఆర్‌జిల్లా తిరువూరుకు చెందిన కాసుల నాటి పద్మనాభశర్మ ఆధ్వర్యంలో పురోహితులు, బ్రహ్మణోత్తములచే యాగాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మూలమంత్ర అనుస్థానములు, దేవత హోమం కార్యక్రమం, పంచ కలశములు, పంచ కృష్ణయ్య, పంచవృక్షయ, నీరాజనం మంత్రపుష్ప యాగములు నిర్వహించారు.

### వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలి

వైరా: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వను నేరుగా వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వైరా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైరా రిజర్వాయర్‌కు లింక్ కెనాల్ అనుసందానం పేరిట అధికారులు జూలూరుపాడు మండలం వినోబానగర్ నుంచి, ఏన్కూరులోని హిమామ్‌నగర్ పైనుంచి.. రేపల్లెవాడ వరకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గోపాలపేట వద్ద లింక్ చేసి బ్యాక్ వాటర్ వైరా రిజర్వాయర్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అలాకాకుండా జూలూరుపాడులోని పాపకొల్లు, ఏన్కూరులోని రాజలింగాల మధ్య గల గుట్టల నుంచి సాగర్ కాల్వకు అనుసంధానం చేస్తే నేరుగా వైరా రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, సమత, సుధాకర్, వెంకటేశ్వరరావు, వీరభద్రం, నర్సయ్య, సాంబశివరావు, రవి, కృష్ణవేణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మధిర(చింతకాని): మండల పరిధిలోని చినమండవ మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను జగన్నాథపురం గ్రామం వద్ద పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్‌ను ఎస్సై నాగుల్‌మీరా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### సింగరేణి సెక్యూరిటీ అధికారి ఆకస్మిక తనిఖీ



జేవీఆర్ ఓసీని పరిశీలిస్తున్న సింగరేణి సెక్యూరిటీ అధికారి శంకర్

సత్తుపల్లిరూరల్: జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో సెక్యూరిటీ అధికారి శంకర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సెక్యూరిటీ గార్డులు విధులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలను రాత్రి, పగలు తేడా లేకుండా నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రతతో ఎండలు ఉన్నందున సెక్యూరిటీ పోస్టుల్లో మంచినీటి సదుపాయం ఉండేలా చూడాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజముద్దీన్‌ను హెచ్చరించారు. సెక్యూరిటీ విధులకు హాజరయ్యే గార్డులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలోని ఏరియాలను పరిశీలించారు. ఆయన వెంట సెక్యూరిటీ అధికారులు దేవదానం, విజేందర్, జోసఫ్, సుభాని ఉన్నారు.

# రైతు పోరాటాలు ఉధృతం చేయాలి



వైరారూరల్: గొల్లెనపాడులో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వైరారూరల్/కొణిజర్ల: రైతులు తమ హక్కుల సాధనకోసం పోరాటాల ఉధృతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు సున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. వైరాలోని గొల్లెనపాడు, లింగన్నపాలెం, విప్పలమడక గ్రామాల్లో అఖిల భారత కిసాన్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం రైతుల పోరాటాలు చేసిన నల్లమోతు వెంకటనారాయణ, షేక్. జానిమియా, రుద్రాక్ష వెంకటచారీల జ్ఞాపకార్థం జెండాలను ఆవిష్కరించారు. అదే విధంగా కొణిజర్ల మండలంలోని తనికెళ్లలో శనివారం అఖిల భారత కిసాన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు లేకపోతే దేశ అభివృద్ధే ఆగిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ వ్యవసాయ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, నారాయణ, ప్రభాకర్, వెంకయ్య, వెంకటేశ్వర్లు ప్రసాద్, తిలక్, వేముల సాంబ, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు గిరిబాబు, సీపీఎం బాధ్యులు కిలారు శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, కొల్లా వెంకటేశ్వర్లు, చంద్ర ప్రసాద్, కృష్ణాచారీ, రాజా పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరా/కొణిజర్ల/ఎర్రుపాలెం/పెనుబల్లి: వైరా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం కరెంట్ నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కొణిజర్లలోని పెద్దగోపతి సబ్‌డివిజన్ పరిధిలోని 11,33 కేవీ విద్యుత్‌లన్ల మరమ్మతుల కారణంగా అయా గ్రామాలకు కరెంట్ ఉండదని ఏడీఈ ఎల్ తిలక్ తెలుపగా.. ఎర్రుపాలెంలోని ములుగుమాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా చుట్టు పక్కల గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈఈ ఆర్.శ్రీనివాసరావు తెలుపగా.. పెనుబల్లిలోని తుమ్మలపల్లి 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో కరెంట్ కట్‌చేయడం జరుగుతుందని ఏఈ భుజేంద్రకుమార్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

తల్లాడ/ఏన్కూరు: తల్లాడలోని పినపాక ఫీడర్, మిట్టపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రామానుజవరం 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ ఉండదని ఏఈ రాజేష్, కూర్నవల్లి సెక్షన్ ఏఈ సుందర్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఏన్కూరులోని తిమ్మారావుపేటలో 33/11కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఏఈ ఉమకాంత్ తెలిపారు. ఈ పరిధిలోని సబ్‌స్టేషన్లకు శనివారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని గౌరిగూడెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, రాజీవ్‌నగర్, సిద్ధారంరోడ్ ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

# రేషన్ కార్డు తప్పనిసరి

- జీరో బిల్లు వర్తింపజేయాలి
- పలువురు లబ్ధిదారులకు నెల నెలా బిల్లు
- రేషన్ కార్డులు ఇవ్వాలని వేడుకోలు



కొణిజర్ల: అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ ఏడాది మార్చి నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుంది. దీనిలో భాగంగా 200 యూనిట్లులోపు కరెంట్ వినియోగించుకునే వారికి కరెంట్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా జీరో బిల్లు వస్తుంది. అయితే కొంత మందికి ఇప్పటికీ కరెంట్ బిల్లు వస్తూనే ఉంది. తెల్లరేషన్ కార్డు ఉంటే బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. 200 యూనిట్లు కంటే తక్కువ వాడిన వారందరూ బిల్లు కట్టకుండా మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే జీరో బిల్లు వస్తుందన్నారు.

**సబ్‌స్టేషన్ల వారీగా..**

కొణిజర్ల మండలంలోని పెద్దగోపతి సబ్ డివిజన్ పరిధిలో కొణిజర్ల, పెద్దగోపతి, చింతకాని సబ్ స్టేషన్లు ఉన్నాయి. కొణిజర్లలో 9,828 మంది గృహ వినియోగదారులు ఉండగా వారిలో 6,419 మందికి జీరో బిల్లు వచ్చింది. 3,409 మందికి జీరో బిల్లు జనరేట్ కాలేదు. పెద్దగోపతి సబ్ స్టేషన్ పరిధిలో 7,489 మందికి గానూ 5,031 మందికి, చింతకాని సబ్ స్టేషన్ పరిధిలో 8,041 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా వారిలో 5,153 మందికి మాత్రమే జీరో బిల్లు వచ్చింది. దీంతో ఆయా లబ్ధిదారులంతా తిరిగి ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అయినా వారికి జీరో బిల్లు రాదు. దీనికి కారణం తెల్లరేషన్ కార్డులు లేకపోవడమే.

**పదేళ్లయినా రేషన్‌కార్డు లేదు..**

గత ప్రభుత్వం 10 ఏండ్ల కాలంలో ఒక్క కొత్త రేషన్ కార్డు మంజూరు చేయలేదు. దీనికితోడు తండ్రి పేరు మీద కరెంట్ మీటర్ ఉండి తండ్రి మృతి చెందితే ఉంటే అట్టి మీటర్ కొడుకులు వాడుతుంటే వారికి రేషన్ కార్డు లేక బిల్లు జనరేట్ అవ్వలేదు. కొంత మంది అద్దెఇండ్లలో ఉండేవారికి కూడా బిల్లు జనరేట్ అవ్వలేదు. దీంతో వారంతా జీరో బిల్లు రాదేమో అన్న ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటున్నందున మరో రెండు నెలల పాటు వీరందరికీ జీరో కరెంట్ బిల్లు వచ్చే అవకాశమే లేదు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత క్యాబినెట్ సమావేశం నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా తెల్లరేషన్‌కార్డులను అర్హులకు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు..**



తెల్లరేషన్ కార్డు లేక కొంత మంది దరఖాస్తు చేసుకోలేదు. కొంతమంది దరఖాస్తు మేము పరిశీలనకు వెళ్లిన సమయంలో ఇంటిలో లేక, సరైన సమాచారం ఇవ్వక జీరో బిల్లులు జనరేట్ అవ్వలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తెల్లరేషన్ కార్డు లేనివారు తహసీల్ నుంచి దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డు పొందితే వారికి జీరోబిల్లు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎల్.తిలక్, ఏడీఈ, పెద్దగోపతి